## నకిలీ గోల్డ్‌కు ధ్రువీకరణతో మోసం

- అప్రైజర్, బ్యాంకు సిబ్బంది ములాఖత్
- 27 మందికి రూ. 4.51 కోట్ల రుణం మంజూరు
- సీసీఎస్‌లో కేసు నమోదు

సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): బ్యాంకులో పనిచేసే అప్రైజర్ ఇద్దరు ఉద్యోగులతో కలిసి నకిలీగోల్డ్‌కు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి బ్యాంక్ ఆఫ్ ఇండియానే మోసం చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. అంబర్‌పేట గోల్నాకకు చెందిన భానుచందర్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఖైరతాబాద్ శాఖకు అప్రైజర్‌గా పనిచేస్తున్నాడు. బ్యాంకులో కుదవపెట్టే బంగారం నాణ్యతను పరిశీలించి పత్రాలు ఇస్తే.. దానిని బట్టి బ్యాంకు రుణం మంజూరు చేస్తుంది. ఇతడితో బ్యాంకులో రుణాలు మంజూరు చేసే తార్నాకకు చెందిన మహ్మద్ కలీం బేగ్, అలీజాపూర్‌కు చెందిన ఆరీఫ్ అహ్మద్ సయీద్ చేతులు కలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య 27 మందికి రూ. 4.51 కోట్ల రుణాలు మంజూరు చేశారు. ఈ ఏడాది జూలైలో కలీంబేగ్ ఖైరతాబాద్ బ్రాంచ్‌లోని క్రెడిట్ డిపార్టుమెంట్ నుంచి సిద్దిపేట బ్రాంచ్‌కు మేనేజర్‌గా వెళ్లాడు. అక్కడ ఆగస్టు నెలలో వహీదాబాను, హమీద సయీద్, సయ్యద్ ఖాదర్, షేక్ రేష్మ పేర్లతో ఐదు గోల్డ్ లోన్లు మంజూరు చేశారు. ఈ గోల్డ్‌లోన్ ఖాతాలపై ఉన్నతాధికారులకు అనుమానం వచ్చి ఆరా తీశారు. ఈ రుణాలకు హైదరాబాద్‌లోని భానుచందర్ అనే అప్రైజర్ నుంచి తెచ్చిన ధ్రువీకరణ పత్రం ఉంది. ఈ బంగారాన్ని మరో అప్రైజర్‌తో పరీక్షించడంతో అదంతా నకిలీ బంగారమనే విషయం తేలింది. దీంతో ఆయా ఖాతాలకు సంబంధించిన రుణాలకు కలీంబేగ్‌ను అధికారులు బాధ్యుడిని చేయడంతో ఆయన ఆ రుణాలను తిరిగి చెల్లించాడు. దీంతో గతంలో కలీంబేగ్ పనిచేసిన ఖైరతాబాద్‌లోని బ్రాంచ్‌లో గోల్డ్ రుణాలపై దృష్టి పెట్టారు. కలీంబేగ్ ఇచ్చిన 44 లోన్లలో కుదవపెట్టిన బంగారాన్ని ఇతర అప్రైజర్లతో తనిఖీలు చేయించగా.. అంతా నకిలీవని తేలింది. పక్కా ప్లాన్‌తో బ్యాంకును మోసం చేసేందుకు బ్యాంకులో పనిచేసే కలీంబేగ్, ఆరీఫ్ అహ్మద్, అప్రైజర్ భానుచందర్ స్కెచ్ వేసి దానిని అమలు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఖైరతాబాద్ బ్రాంచ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బాలగోపాలన్ సీసీఎస్‌లో ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## దృష్టి మళ్లించి.. రెండు సెల్‌ఫోన్ల చోరీ

### ఒకే రోజు రెండు ఘటనలు


మల్కాజిగిరి, అక్టోబర్ 20: బాధితుల దృష్టి మళ్లించిన దుండగులు వేర్వేరు చోట్ల రెండు సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనలు మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగాయి. బాధితుల కథనం ప్రకారం.. పీవీఎన్ కాలనీకి చెందిన తేజ ఉదయం పాలు కొనడానికి దుకాణం వద్దకు వచ్చాడు. ద్విచక్ర వాహనాలపై వచ్చిన ముగ్గురు యువకులు.. పాల దుకాణం వద్ద ఆగారు. వారిలో ఓ యువకుడు పాల దుకాణం వద్ద డబ్బును కింద పడేశాడు. మీ డబ్బు కిందపడిపోయిందంటూ తేజతో చెప్పాడు. తేజ ఆ డబ్బును తీసుకోవడానికి కిందకు వంగడంతోనే.. అతడి జేబులో నుంచి సెల్‌ఫోన్ చోరీ చేశారు. తేజ వెంటనే అప్రమత్తమై దుండగుల్లో ఒకరిని పట్టుకునేందుకు ప్రయత్నించగా.. వచ్చిన ముగ్గురూ వాహనంపై పరారయ్యారు.

### మరో ఘటనలో..

ఈస్ట్ ఆనంద్‌బాగ్‌కు చెందిన కుమార్ కూరగాయలు కొనడానికి వచ్చాడు. అతడి దృష్టి మళ్లించిన దుండగులు ముందు జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను కొట్టేశారు. గతనెల వేంకటేశ్వరనగర్‌కు చెందిన సోమనారాయణ సెల్‌ఫోన్ కూడా ఈ విధంగానే చోరీకి గురైంది. ముఖాలకు మాస్కులు ధరించి, తలకు హెల్మెట్ పెట్టుకొని నంబర్ ప్లేట్‌లేని వాహనంపై వస్తున్న దుండగులు ఈ చోరీలకు పాల్పడుతున్నారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆదిబట్లలో జరిగిన దసరా సమ్మేళనంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితారెడ్డి

# రేవంత్ చెప్పేవన్నీ దొంగ మాటలే..

- ఫార్మాసిటీ ఏర్పాటుపై కోర్టునూ తప్పుదోవ పట్టిస్తున్న సీఎం
- దమ్ముంటే ఫార్మాసిటీని కట్టు.. లేదంటే రైతుల భూమి వారికి ఇచ్చెయ్
- గల్లీ, గల్లీ తిరిగి ముఖ్యమంత్రి మోసాలను ప్రజలకు వివరిస్తాం
- రైతుల తరఫున బీఆర్ఎస్ ఎప్పటి నుంచో పోరాడుతున్నదని వ్యాఖ్య
- ఫార్మా రైతులనే కాదు.. అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేసింది
- ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ కార్యకర్తల దసరా సమ్మేళనంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### పవర్‌లోకి రాగానే మాట మార్చారు..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేసి.. ఆ భూములను రైతులకు ఇప్పిస్తామని అసెంబ్లీ ఎన్నికలప్పుడు కల్లబొల్లి మాటలు చెప్పిన కాంగ్రెస్ నాయకులు కోదండరెడ్డి, ప్రస్తుత మంత్రులు భట్టి విక్రమార్క, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పవర్‌లోకి రాగానే మాట మార్చారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఫార్మాసిటీ ఏర్పాటుకు బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుడి తే...నేడు అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కారు ఆ ప్రాంతంలో నాలుగు రకాల పేర్లుపెట్టి ఇష్టానుసారంగా దండుకుంటున్నది. ఈ విషయంపై ఫార్మాసిటీ ప్రాంత రైతులు కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి. ప్రస్తుత సర్కారు మాటలకే సరి పోయింది. చేతల్లో ఏమి లేదు. ఫార్మాసిటీని రద్దు చేస్తున్నామని చెప్పినందున వెం టనే దానిని రద్దు చేసి.. ఆ భూములను తిరిగి రైతులకు ఇవ్వాలి. – సబితాఇంద్రారెడ్డి, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే



రంగారెడ్డి, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ)/ఇబ్రహీంపట్నం రూరల్ : ఫార్మాసిటీపై రేవంత్‌రెడ్డి చెప్పేవన్నీ దొంగ మాటలేనని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల దసరా సమ్మేళనం ఆదివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్రమీద గార్డెన్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర యువజన నాయకుడు మంచిరెడ్డి ప్ర శాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగింది. మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ..ఫార్మాసిటీ ఉందని ఒకసారి, లేదని మరోసారి చెబుతూ రేవంత్‌రెడ్డి కోర్టును కూడా తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. నాలుగు ఇంచుల భూమినీ సేకరించని ముఖ్యమంత్రి ఫోర్త్‌సిటీని ఎలా నిర్మిస్తారని ఎద్దేవా చేశారు. గ్రీన్‌సిటీ, ఫార్మాసిటీ కోసం కేసీఆర్ ఎనిమిదేండ్లు కష్టపడ్డారని, రైతులను ఒప్పించి, మెప్పించి 14,000 ఎకరాలను సేకరించామని గుర్తు చేశారు. దమ్ముంటే ఫార్మాసిటీని కట్టు.. లేకుంటే ఆ భూములను రైతులకు ఇచ్చేయని సూచించారు. ఎన్నికలకు ముందు ఓ మాట, తర్వాత మరోమాట చెప్పి రేవంత్‌రెడ్డి చేస్తున్న మోసంపై ప్రజాక్షేత్రంలో పోరాటం చేస్తామని.. గల్లీ గల్లీ తిరిగి ప్రజలకు వివరిస్తామన్నారు. ఫార్మా రైతులనే కాదు.. అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. గ్రామగ్రామాన మనమే కథానాయకులుగా మారాలని కార్యకర్తలకు ఈ సందర్భంగా కేటీఆర్ పిలుపునిచ్చారు.

### రైతు భరోసాకు రాం రాం..

మూడు పంటలకు పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పడంతోపాటు కేసీఆర్ ముష్టి రూ.10 వేలు ఇస్తున్నారని.. తాము అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.15 వేల చొప్పున ఇస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశారని కేటీఆర్ మండిపడ్డారు. ఖరీఫ్ రైతు భరోసా ఎగ్గొడుతున్నామని సిగ్గులేకుండా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల చావు కబురు చల్లగా చెప్పారని ఎద్దేవా చేశారు. రైతుల తరఫున బీఆర్ఎస్ ఎప్పటి నుంచో పోరాటం చేస్తున్నదని.. కానీ, ఇతర రైతు సంఘాల నోళ్లు ఎందుకు మూగబోయాయని కేటీఆర్ ప్రశ్నించారు. రైతుల తరఫున మాట్లాడాల్సిన కమ్యూనిస్టులు ఎక్కడికి పోయారన్నారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల సందర్భంగా సాక్షాత్తూ రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని, పిల్లల ఉద్యోగాల సంగతేమోగానీ..రాహుల్‌గాంధీకి ప్రతిపక్ష నేతగా, రేవంత్‌రెడ్డికి సీఎంగా ఉద్యోగాలు వచ్చాయని విమర్శించారు. అశోక్‌నగర్‌లో గ్రూప్–1 అభ్యర్థులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జీవో 29తో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు.

### ఆయన మల్‌రెడ్డి కాదు.. గోల్‌మాల్ రెడ్డి..

స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఆయన మల్‌రెడ్డి కాదని.. గోల్ మాల్ రెడ్డి అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పైన రేవంత్‌రెడ్డి ఎట్ల ఉన్నాడో..కింది స్థాయిలో నాయకులూ అలాగే ఉన్నారని ఎద్దేవా చేశారు. ఇక్కడి ఎమ్మెల్యే కూడా మైనింగ్, రైస్‌మిల్లుల నుంచి దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. కొన్ని చిన్న చిన్న తప్పులు చేయడం వల్ల ఇబ్రహీంపట్నంతో సహా అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయామని, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎమ్మెల్యే గా ఈ ప్రాంత ప్రజల సంక్షేమానికి పాటుపడ్డారని కొనియాడారు. సబితక్క సైతం స్వార్థం లేకుండా పనిచేశారని.. కలెక్టరేట్, ఫాక్స్‌కాన్ వంటి కంపెనీలను కొంగర కలాన్‌లో ఏర్పాటు చేయించి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారన్నారు. పోలీసులు కేసులు పెడితే బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడొద్దని.. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కేటీఆర్ భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ సమావేశంలో పిక్ పాకెట్, చైన్ స్నాచర్స్ ఉన్నారని, వేదికపై ఉన్న నాయకులకు స్థానిక పోలీసులు సమాచారం ఇవ్వగా.. కేటీఆర్ తనదైన శైలిలో స్పందించారు. పిక్ పాకెట్, చైన్ స్నాచర్స్ బీఆర్ఎస్ మీటింగుల్లో ఉండరని, కాంగ్రెస్ మీటింగుల్లో ఉంటుందని చురక అంటించారు. ఇటీవల జరిగిన ఏ బీఆర్ఎస్ సమావేశాల్లోనూ ఇంత మంది పోలీసులను చూడలేదన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు క్యామ మల్లేశ్, రాష్ట్ర యువ నాయకుడు ప్రశాంత్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వంగేటి లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ కృపేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, మొద్దు అంజిరెడ్డి, జేపీ శ్రీనివాస్, ఆకుల యాదగిరి, మండలపార్టీ అధ్యక్షులు బుగ్గరాములు, రమేశ్‌గౌడ్, రమేశ్, కిష్‌గౌడ్, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు అల్వాల వెంకట్‌రెడ్డి, కొప్పు జంగయ్య, ప్రధాన కార్యదర్శులు బహదూర్, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్‌రావు, బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జెర్కోని రాజు, బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్, నాయకులు శివసాయి, ప్రసాద్‌గౌడ్, ప్రవీణ్‌నాయక్, కొండ్రు ప్రవీణ్, దేవేందర్‌గౌడ్, గరిగె శేఖర్‌గౌడ్, రాజు, జానీపాషా, కరుణాకర్, గణేశ్, బల్వంత్‌రెడ్డి, జంగయ్య ముదిరాజ్, అరవిందర్, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**PEST CONTROL**



★KS పెస్ట్ కంట్రోల్ టెర్మిట్: 10 సం||ల గ్యారంటీ, చెదలు, బొద్దింకలు, నల్లులు, బల్లులు, కిచెన్ జెల్ రీజనబుల్ ధరల్లో. 9494914020, 8686101598.
NT-335089

**GOLD FINANCE**



★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739.
NT-335088

**OLD AGE HOME**



★వృద్ధులు, NRI's విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్, ఉప్పల్ & ECIL - కీసర రోడ్, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతితో. సంప్ర: 7981467036, 9391039990, 8074327715.
NT-334825

**PLOT FOR SALE**



★గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజీ, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 9666607146.
NT-338784

★దసరా/దీపావళి స్పెషల్ ఆఫర్: శ్రీశైలం హైవే మెయిన్ రోడ్‌లో కందుకూర్ దగ్గర HMDA అప్రూవల్ లేఔట్ ఓపెన్ ప్లాట్లు & All Devp. విల్లాస్ కలవు. పోచారం దగ్గర HMDA లేఔట్. Ph: 7095344396.
NT-335076

**WANTED**




★రియల్ ఎస్టేట్ రంగంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న ప్రముఖ కం||లో మార్కెటింగ్ చేయుటకు M/F కావలెను. జీతం+కమీషన్. 9700021777.
NT-335095

**కావలెను**

రక్షణ సెక్యూరిటీ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ నందు పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ పురుషులు అర్జెంటుగా కావలెను. మదీనాగూడ, చింతల్, అమీర్‌పేట, ఎ.ఎస్.రావు నగర్. 8500199996

**WANTED**

★ఘట్‌కేసర్, జోడిమెట్ల లేడీస్ హాస్టల్‌లో వంటమనుషులు స్త్రీ/పు భార్యాభర్తలైన & హౌస్‌కీపింగ్‌కు ఒంటరి మహిళ కావలెను. మంచి జీతం + ఉచిత వసతి + భోజనం. Ph: 9949338350.
NT-333089

★రియల్ ఎస్టేట్ రంగంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న ప్రముఖ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు M/F కావలెను. శాలరీ + కమీషన్, ఫ్రీ ట్రైనింగ్ (Freshers Only): 9391184511.
NT-339356

**INSURANCE**

★Become an Life Insurance Advisor with TATA-AIA. Work from anywhere 100% Digitally. Unlimited Income, Growth & International Trips Every Month. Part Time / Full Time. Call / WhatsApp: 9505931826.
NT-338861

**పూజారి కావలెను**

★గచ్చిబౌలి – జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని శ్రీ రాజరాజేశ్వరీ దేవి – చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో పూజలు చేయుటకు పూజారి కావలెను. ఆసక్తి ఉన్నవారు క్రింది నెంబర్‌కు కాల్ చేయండి: 9492281157.
NT-335098

**CHANGE OF NAME**

★I, MOHAMMED NASEERULLAH KHAN, S/o. Mohammed Amanullah Khan, R/o. H.No. 11-3-37/A/161, New Mallepally, Passport bearing No: B0574471, hereby Change My Spouse Name FATIMA-US-ZOHRA (NEHA) to FATHIMA UNNISA for all future purposes.
NT-CKPL

★I, SHAIK MAHABOOB HUSSAIN, R/o. 18-7-423/A/351, Aman Nagar, Talabkatta, Hyderabad, TG has Changed My Name as SHAIK MEHBOOB.
NT-336732

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

4 లైన్లకు రూ.400/- (5% GST అదనం) | ప్రతి అదనపు లైనుకు రూ.75/- | Cell: 9848077857

దిల్‌సుఖ్‌నగర్ : 9182777805 | L.B.నగర్, వనస్థలిపురం : 9182777209 | అమీర్‌పేట్, మెహిదీపట్నం : 9182777126
మల్కాజిగిరి, E.C.I.L : 9182777125 | ఉప్పల్, తార్నాక : 9182777806 | B.N.రెడ్డి నగర్, సంతోష్‌నగర్ : 9182777204
కూకట్‌పల్లి, బాలానగర్ : 9182777205




హైదరాబాద్, ఆట ప్రతినిధి: గ్రామీణ క్రీడారంగాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించబోతున్న సీఎం కప్–2024 విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించేందుకు సాగుతున్న టార్చ్ రిలే ర్యాలీ సందడిగా సాగుతున్నది. ఇప్పటికే 31 జిల్లాలు పూర్తిచేసుకుని ఆదివారం రంగారెడ్డి జిల్లాకు చేరుకుంది. టీకేఆర్ ఇంజినీరింగ్ కాలేజీ కామన్ వద్ద వందలాది మంది క్రీడాకారులు రిలే ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అక్కడి నుంచి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో సాట్స్ చైర్మన్ శివాసేనారెడ్డి, మధుయాష్కిగౌడ్, మాల్‌రెడ్డి రాంరెడ్డి, కృష్ణయ్య, చంద్రారెడ్డి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు. సోమవారం మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో ర్యాలీ జరుగనుంది.

## ఆటోలో బ్యాగును మరిచిపోయిన మహిళ

### తిరిగి అప్పగించిన ఆటోడ్రైవర్

ఉప్పల్, అక్టోబర్ 20: ఆటోలో ప్రయాణించిన ఓ మహిళ తన బ్యాగును మరిచిపోయింది. ఆ బ్యాగును గుర్తించిన పోలీసులకు తిరిగి బాధితులకు అప్పగించారు. ఉప్పల్ పోలీసుల కథనం ప్రకారం.. శిల్ప ఆదివారం రామంతాపూర్ నుంచి ఉబెర్ ఆటోలో ఉప్పల్ వెళ్లింది. ఆమె ఆటోలోనే తన బ్యాగును మరిచిపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు ఆదివారం మధ్యాహ్నం ఆటో డ్రైవర్ రమావత్ వెంకటేశ్వర్లు ద్వారా బ్యాగును గుర్తించారు. ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి సమక్షంలో బ్యాగులో ఉన్న 7 తులాల బంగారు నగలు, రూ.40 వేల నగదును బాధిత మహిళ కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్‌ను ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

## గంజాయి విక్రేతల అరెస్ట్



సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అబ్కారీ ఎస్టీఎఫ్ అధికారులు ఆదివారం అరెస్టు చేశారు. వారి వద్ద 3.693కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్టీఎఫ్ ఈఎస్ నంద్యాల అంజిరెడ్డి వివరాల ప్రకారం .. ధూల్‌పేట ప్రాంతానికి చెందిన దేవరాజ్ సింగ్, అజయ్‌సింగ్, దీపక్, ప్రవీణ్‌సింగ్ ధూల్‌పేట పరిసర ప్రాంతాలైన జియాగూడ, పురానాపూల్ తదితర ప్రాంతాల్లో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నారు. నితీశ్ అనే మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ధూల్‌పేట ఎక్సైజ్ స్టేషన్ సీఐ మధుబాబు, ఎస్ఐలు మధు భాస్కర్, భాస్కర్ గౌడ్, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్‌రెడ్డి, శ్రీధర్, అజీమ్, కానిస్టేబుళ్లు రాకేశ్, మహేశ్, రాహుల్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రేటర్ @31.4డిగ్రీలు

సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 31.4డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.3డిగ్రీలు, గాలిలో తేమ 67శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.


## గేదెను ఢీ కొట్టిన బైక్.. యువతి దుర్మరణం

మేడ్చల్, అక్టోబర్ 20: గేదెను బైక్ ఢీ కొట్టిన ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ నుంచి పల్సర్ బైక్‌పై నలుగురు హైదరాబాద్ వైపు వస్తున్నారు. జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రాగానే అకస్మాత్తుగా గేదె అడ్డురావడంతో బైక్‌తో ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న సంధ్య (26) అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన ముగ్గురు తీవ్రంగా గాయ పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు గాయపడిన వారిని ఆర్వీఎం హాస్పిటల్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### యువకుడి ఆత్మహత్య..

యువకుడు ఆత్మహత్య ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మజీద్‌పూర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మజీద్‌పూర్ గ్రామానికి చెందిన వినయ్ రాజు(23) ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బైక్‌పై బయటకు వెళ్లిపోయాడు. అతడు వెళ్లిన కొద్ది సేపటికి వినయ్ రాజు తండ్రి మజీద్‌పూర్‌లోని తన పొలం వద్దకు వెళ్లగా.. అక్కడ బైక్ కనిపించింది. చుట్టు పక్కల చూడగా.. హనుమాళ్ల కుంట పక్కన ఉన్న ఓ చెట్టుకు కరెంట్ వైర్‌తో ఉరేసుకొని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## హర్యానా గవర్నర్ దత్తాత్రేయకు తప్పిన ప్రమాదం



శంషాబాద్ రూరల్, అక్టోబర్ 20: హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయకు ఆదివారం రాత్రి తృటిలో ప్రమాదం తప్పింది. ఈ ఘటన శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ బాలరాజు కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో గవర్నర్ హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్తున్నారు. గవర్నర్ వాహనం శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలోకి రాగానే.. అదే సమయంలో ఎండివర్ కారు డ్రైవర్ సర్ఫరాజ్ ఖాన్ ఒక్కసారిగా ఎడమ వైపు తిరగడంతో.. వెనుక నుంచి వస్తున్న గవర్నర్ కన్వాయ్‌లోని కార్లు ఒకటికి ఒకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మూడు వాహనాలు దెబ్బతిన్నాయి. గవర్నర్‌కు ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.